బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

అత్తాపూర్: అన్ని వర్గాల ప్రజలు పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా అత్తాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో మసీదు కమిటీ నిర్వాహకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... పండుగలను అందరూ కలిసి జరుపుకోవాలన్నారు. శాంతియుత వాతావరణంలో జరుపుకోవడం వల్ల ఎంతో బాగుంటుందన్నారు. పోలీసులకు ప్రజలంతా సహకరించాలని సూచించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, సులేమాన్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవాజుద్దీన్ అహ్మద్, మహ్మద్ తాహేర్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి



కాటేదాన్‌లో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న భూపాల్

మైలార్‌దేవ్‌పల్లి: కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్ అధ్యక్షతన లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా కాటేదాన్‌లో నిరసన సభను నిర్వహించారు. సీఐటీయూ కార్యాలయం నుంచి రామ్‌చరణ్ ఆయిల్ మిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. నేతలు భాస్కర్, ప్రకాష్, ప్రవీణ్, శ్రీనివాస్, సచిన్, బాబురావు, రాజు, జంగిర్, కుల్‌దీప్, శశికాంత్, లక్ష్మణ్, కిషోర్, శ్రీనివాస్‌రెడ్డి, టి.వెంకటేష్, శంకర్, లక్ష్మణ్‌యాదవ్, టి.వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేశాల భూపాల్‌కు సన్మానం



భూపాల్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్‌గుప్తా

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సమాచార హక్కు చట్టం కమిషనర్ దేశాల భూపాల్‌ను మంగళవారం స్థానిక నాయకుడు సోమ శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పల్లు జగన్, వలకొండ విజయ్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్‌లోని బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్‌లో జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు, ఉర్దూ భాషా ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణా శిబిరాన్ని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సందర్శించారు. ప్రస్తుత సాంకేతికతలో వస్తున్న విప్లవాత్మక మార్పులను బోధనాభ్యాసన ప్రక్రియలో ఉపయోగించి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉత్తమమైన విద్యనందించేందుకు ఈ శిక్షణ తరగతులు ఉపాధ్యాయులకు ఉపయోగపడతాయన్నారు. నాయకత్వ లక్షణాలను ప్రధానోపాధ్యాయులు పెంపొందించునేందుకు ఈ శిక్షణ కార్యక్రమ ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా వారు శిబిరంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఐదు రోజులపాటు ట్రైనింగ్‌లో 320 మంది టీచర్లకు శిక్షణ ఇస్తున్నారు. రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, మండల విద్యాధికారి విజయ్‌కుమార్, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మణికొండ: రోడ్డు పక్కన పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని నార్సింగి పోలీసులు గుర్తించారు. పోలీసుల సమాచారం మేరకు... నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని మాక్స్ షోరూం పక్కన ఓ వ్యక్తి అపస్మారకంగా పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పరిశీలించిన పోలీసులు అతను అప్పటికే మృతి చెంది ఉన్న విషయాన్ని గుర్తించారు. అతని గురించి చుట్టు పక్కల ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవటంతో మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అతని వయసు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండొచ్చన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

కాలుష్యపు కోరల్లో పీరంచెరువు

- చెరువులో కలుస్తున్న వ్యర్థాలు
- దుర్గంధభరితంగా చెరువు పరిసరాలు
- పేరుకే దత్తత.. చేసిన అభివృద్ధి శూన్యం

బండ్లగూడ: గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న 34.20 ఎకరాల్లో విస్తరించి ఉన్న ప్రధాన నీటి వనరు పీరంచెరువు. ఒకప్పుడు ప్రజలకు తాగునీరు అందించిన చెరువుకు ఇప్పుడు రక్షణ కరువైంది. అధికారుల నిర్లక్ష్యంతో కలుషితంగా పీరంచెరువు.. పోలీస్ అకాడమీ చుట్టుపక్కల రహదారి పొడవునా వెలిసిన హోటల్స్ నుంచి వచ్చే వ్యర్థ జలాలు నేరుగా చెరువులో కలుస్తుండటంతో పాటు చెత్తా చెదారాన్ని చెరువులో పడేస్తుండటంతో చెరువు దుర్గంధ బరితంగా మారింది. ఈ ప్రాంతంలో చెత్త వేయరాదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన ఫలితం మాత్రం శూన్యం. చుట్టుపక్కల కాలనీ వాసులు, గ్రేటెడ్ కమ్యూనిటీవాసులు దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరో హుస్సేన్ సాగర్‌లా...

మురుగు నీరు చెరువులో చేరకుండా చర్యలు తీసుకుంటామన్న ప్రజాప్రతి నిధులు, అధికారుల హామీలు అలాగే మిగిలిపోయాయి. కొన్ని సంవత్సరాల నుంచి చెరువులోకి మురుగు నీరు వస్తుండటంతో ప్రస్తుతం చెరువు రూపు రేఖలు మారిపోతున్నాయి. పట్టించుకోవాల్సిన యంత్రాంగం తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే చెరువు మరో హుస్సేన్ సాగర్‌ను తలపించే పరిస్థితికి వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులోకి మురుగునీరు రాకుండా అధికారులు తగు చర్యలు చేపట్టవలసిందిగా స్థానికులు కోరుతున్నారు.

పేరుకే దత్తత...

శాంత శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ రియల్ వ్యాపార సంస్థ పీరంచెరువు సమీపంలో భారీ నిర్మాణాలు చేపడుతుంది. చెరువు సమగ్ర అభివృద్ధి, సుందరీకరణ కొరకు హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ నుంచి పీరంచెరువు దత్తతకు ఇచ్చినట్టుగా మూడు సంవత్సరాల క్రితం చెరువు చుట్టు భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటిపై చెరువు చుట్టు పచ్చదనం, వాకింగ్ ట్రాక్, స్ట్రీట్ లైటింగ్, ఫర్నిచర్, పిల్లలకు ఆట పరికరాలను అమర్చడం వంటివి చేస్తామని వాటిపై ఉంది. ఇప్పటి వరకు ఎంలాంటి అభివృద్ధి చేయలేదు. వారు ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు కూడా పాడైపోతున్నాయి.

అలుగు నీరు పారేందుకు డ్రైన్ బాక్స్ పనులు

గత డిసెంబర్‌లో హైడ్రా కమిషనర్ పీరంచెరువు పర్యటించి పరిశీలించారు. పీరంచెరువు అలుగు వెళ్లే ప్రాంతంలో శాంత శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నిర్మాణం చేపడుతుండటంతో అక్కడ వారు ప్లానింగ్‌లో పేర్కొన్న విధంగా పీరంచెరువు అలుగు నీరు పారేందుకు డ్రైన్ బాక్స్ నిర్మించలేదని, 15 రోజుల్లో చేపట్టాలని లేదంటే అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. 5 నెలలు గడుస్తున్న డ్రైన్ బాక్స్ పనులు పూర్తికాలేదు. చెరువు కట్టపై నుంచి పీరం చెరువు గ్రామంలోకి వెళ్లలేని పరిస్థితి ఉంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి చెరువు అభివృద్ధి పనులు మొదలు పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పీరంచెరువులోకి వెళ్తున్న వ్యర్థజలాలు



హెచ్చరిక బోర్డు పెట్టినా ఫలితం శూన్యం



రంగు మారిన నీరు



చెరువు పక్కనే చెత్తాచెదారం

బహదూర్‌గూడలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

శంషాబాద్ రూరల్: బహదూర్‌గూడలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగులో రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను శాస్త్రవేత్త లు వివరించారు. గ్రామంలో అధికంగా సాగు చేసే పూలు, కూరగాయాల పంటల్లో నాణ్యమైన దిగుబడి వచ్చేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రతలను తెలియజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ సుకృత్‌కుమార్, ఏఈఓ రాఘవేందర్, రైతులు పాల్గొన్నారు.

లేబర్ క్యాంప్‌లో అగ్నిప్రమాదం



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల, బాలాజీనగర్ కాలనీ పక్కన ఉన్న ఓ లేబర్ క్యాంప్‌లో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. లేబర్ క్యాంప్‌లో ఓ వ్యక్తి వంట చేస్తుండగా మంట బట్టలకు అంటుకుని అది గుడిసెలో పాకింది. వెంటనే అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇవ్వటంతో రెండు ఫైరింజన్‌లు సకాలంలో చేరుకుని మంటలను ఆర్పివేశాయి. దాంతో ఎలాంటి నష్టం జరగలేదని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. అన్ని గుడిసెలే ఉన్నాయని, ఫైరింజన్ రావటం ఆలస్యం అయితే వాటన్నింటికీ మంటలు వ్యాపించి పెద్ద ప్రమాదం జరిగేదన్నారు. సకాలంలో ఫైరింజన్ రావటంతో పెద్ద ముప్పు తప్పించదని లేబర్ క్యాంప్ నివాసితులు తెలిపారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదా ధామంలో సంస్కార సాధన వర్గ ముగింపు కార్యక్రమం మంగళవారం ముగిసింది. ముఖ్య అతిథిగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చిన్నారులు చిన్నప్పటి నుంచి చక్కటి సంస్కారములు అలవార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చక్కటి గుణగణాలు కూడా చిన్నప్పటి నుంచి సాధన చేయాలన్నారు. శ్రీ సరస్వతీ శిశు మందిరాలు సమాజంలో చక్కటి వికాస సాధనకు చేస్తున్న ప్రయత్నాలు చాలా అద్భుతమైనవన్నారు. కేవలం 15 రోజులలోనే శ్రీ శారదాధామంలో నేర్చుకొని యోగా, కరాటే, యోగా వ్యాయామం, కళాత్మక అంశాలు చక్కగా ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఇక్కడ నేర్చుకున్న విషయాలను ఇంకా సాధన చేసి భవిష్యత్తులో చక్కటి వ్యక్తులుగా నిర్మాణం కావాలని కోరారు. చిన్నారుల కార్యక్రమాలు అందరినీ ఆకర్షించాయి. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, శ్రీ సరస్వతీ విద్యాపీఠం అధ్యక్షుడు తిరుపతిరావు, ప్రాంత సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్‌రావు, శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం అధ్యక్షుడు గోకరి అర్జున్‌గౌడ్, ఆవాస విద్యాలయం కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

నేటి నుంచి నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను బుధవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. బాబు జగ్జీవన్ రామ్ యూత్ అసోసియేషన్ సభ్యులు, ప్రణవ భక్త సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ నెల 23వ తేదీ వరకు మహోత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దేవాలయంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలను వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలను అందంగా ముస్తాబు చేశారు. 23వ తేదీన ఉదయం 7.36 గంటలకు యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, కలశ ప్రతిష్ఠ తదితర ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్న ప్రసాద వితరణ ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

టీడబ్ల్యూజేఎఫ్ రాజేంద్రనగర్ అధ్యక్షుడిగా గోపాల్



టీడబ్ల్యూజేఎఫ్ రాజేంద్రనగర్ నియోజకవర్గ కార్యవర్గం

శంషాబాద్: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాజేంద్రనగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా శంషాబాద్ సీనియర్ జర్నలిస్టు అలమనేటి గోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా భిక్షపతి, కోశాధికారిగా ఎ. భానుమూర్తి, గౌరవ సలహాదారుగా కోళ్ల యాదయ్య నియమితులయ్యారు. మంగళవారం పట్టణంలోని పద్మావతి గార్డెన్‌లో జాతీయ కౌన్సిల్ సభ్యుడు బి.దేవేందర్ అధ్యక్షతన, జిల్లా నాయకుల సమక్షంలో ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పి.నర్సింహాయాదవ్, ఇ.ప్రభాకర్, పి.మాధవాచారి, సహాయ కార్యదర్శులుగా కె.సతీష్‌బాబు, పి.యాదగిరి, మద్దూర్ శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా ఆర్.జ్ఞానేశ్వర్ నియమితులయ్యారు. ఇటీవల హఠాన్మరణం చెందిన ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌రావుకు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా టీడబ్ల్యూజేఎఫ్ పని చేస్తోందని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సైదులు, జిల్లా నాయకులు గణేష్, సురేష్, చంద్రశేఖర్, రాజేంద్రనగర్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు సుదర్శన్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సైన్యానికి సలాం



శంషాబాద్‌లో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శంషాబాద్: పాక్ ఉగ్రమూకలకు తుదముట్టించిన భారత సైన్యానికి సలాం అంటూ వక్తలు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం శత్రుదేశం పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పిందన్నారు. భారత సైన్యానికి మద్దతుగా మంగళవారం సాయంత్రం శంషాబాద్ పట్టణంలో బీజేపీతో పాటు పట్టణ ప్రజలు నిర్వహించిన తిరంగా ర్యాలీలో నేతలు మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాలతో త్రివిధ దళాలు పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పాయన్నారు. యాత్రలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.రాజ్‌భూపాల్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నేత డాక్టర్ ప్రేమ్‌రాజ్, జిల్లా నాయకుడు నందకిశోర్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వేసవి శిక్షణ షురూ



మాట్లాడుతున్న హైదరాబాద్ ఆర్‌జేడీ విజయలక్ష్మి

అత్తాపూర్: ప్రభుత్వ ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేసవి శిక్షణలో భాగంగా ప్రోగ్రాం ఆన్ కెపాసిటీ బిల్డింగ్ ఫర్ ప్రైమరీ స్కూల్ టీచర్స్ అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించింది. రాజేంద్రనగర్ ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి, కోర్స్ డైరెక్టర్ శంకర్ రాథోడ్ ఆధ్వర్యంలో ఈ శిక్షణను అత్తాపూర్‌లోని ఎడిఫై వరల్డ్ స్కూల్‌లో నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి 135 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని విద్యాశాఖ హైదరాబాద్ ఆర్‌జేడీ విజయలక్ష్మి సందర్శించి శిక్షణ తరగతుల నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, వసతులను పరిశీలించారు. డీఆర్‌పీ పుష్పరాగం, ఎంఆర్‌పీలు మహేశ్వర్, అనిల్, సంతోష్, రోహిణి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌తోనే వేగంగా నిర్మాణం



మాట్లాడుతున టెక్నికల్ ఇంజనీర్ శివకుమార్



క్విజ్ విజేతలకు బహుమతులను అందజేస్తున్న డీలర్

టెక్నికల్ ఇంజనీర్ శివకుమార్

మణికొండ: ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ శివకుమార్ పేర్కొన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లిలోని నాగార్జున స్టీల్ ప్రొడక్స్ డీలర్ షాపులో మంగళవారం రాత్రి తాపీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అల్ట్రాఫాస్ట్‌తో స్లాబులు, పిల్లర్లు, వంతెనలు, రహదారుల నిర్మాణం వేగవంతంగా పూర్తవుతాయన్నారు. భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ వినియోగదారులకు ఉచితంగా సాంకేతిక సాయం అందిస్తామని ఆయన వెల్లడించారు. స్లాబ్ వేసే సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి విలువైన సలహాలను ఇస్తారన్నారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లకంటే భారతి సిమెంట్ కేవలం రూ. 20 మాత్రమే అధికంగా ఉంటుందన్నారు. డీలర్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... భారతి సిమెంట్ నాణ్యతతో పాటు సేవలు వేగవంతంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ఇతర సిమెంట్‌లతో భారతి సిమెంట్‌కు తేడాలపై క్విజ్ నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

దుంప కూరల సాగును పెంచేందుకు కార్యాచరణ



శాస్త్రవేత్తలకు జ్ఞాపికలను అందజేస్తున్న అధికారులు

భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఏసీజీ డాక్టర్ సుధాకర్ పాండే

ఏజీవర్సిటీ: దేశంలో దుంప కూరల సాగును భారీగా పెంపొందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (ఏసీజీ) డాక్టర్ సుధాకర్ పాండే అన్నారు. రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాలలో జరిగిన దుంప కూరగయాలపై అఖిల భారత సమన్వయ సదస్సు ముంగిపు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... కసావలో న్యాచురల్ ఫామింగ్, కందలో ఇరిగేషన్ దూది పురుగు యాజమాన్యానికి జీవ నియంత్రణ పద్ధతులు భూమిలో మిగిలిన తేమను వాడుకొని దిగుబడి పెంపొందించేలా కార్యాచరణ, పోటాషియం, మోతాదును తగ్గించే అంశాలపై పరిశోధనలను ముమ్మరం చేస్తామన్నారు. వచ్చే ఐదేళ్లలో భారీగా దుంప కూరల జనక రకాలను సేకరించి పరిశీలించాలని శాస్త్రవేత్తలను కోరారు. ముక్తేశి అనే నూతన రకం తెలంగాణ ప్రాంతంలో రైతులు ప్రధానంగా ఎదుర్కొంటున్న ఆకుమాడు తెగులును విజయవంతంగా నిలువరిస్తోందని రైతులు ఈ రకాన్ని సాగు చేయవచ్చని ఆయన సిఫార్సు చేశారు. అలాగే రబీలో అధిక దిగుబడి ఇవ్వడంతో పాటు జూన్, జులై నెలల్లు విత్తుకోవడానికి అనుకూలంగా ఉండే శ్రీకిర రకాన్ని సైతం ఇక్కడ విత్తుకోవచ్చని సూచించారు. అధిక కెరటిన్ ఉండే నారింజరంగు కండనిచ్చే దుంప రకాలను అలాగే అధిక దిగుబడితో పాటు అధిక స్టార్చ్ పదార్థాలు కలిగి ఉన్న రకాలను పరిశీలించి రైతులకు అందించాలని పేర్కొన్నారు. తెలంగాణ దుంప కూరగాయల రైతులతో శాస్త్రవేత్తల బృందం ముఖాముఖిని నిర్వహించింది. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలో దుంప కూరలు సాగు చేస్తున్న మాల్కారం, బహదూర్‌గూడ, లక్ష్మీతండా గ్రామాల నుంచి వచ్చిన రైతులతో దేశవ్యాప్తంగా వచ్చిన శాస్త్రవేత్తలు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తక్కువ కాలంలో చీడపీలను తట్టుకొని అధిక దిగుబడులను ఇచ్చే రకాలు కావాలని రైతులు కోరారు. కార్యక్రమంలో కేంద్రీయ దుంప కూరల పరిశోధన సంస్థ డైరెక్టర్ జి.బైజు, ప్రధాన శాస్త్రవేత్త విక్రమాదిత్య పాండే, ప్రశాంత్, పిడగం సైదయ్య, ప్రీతం గౌడ్, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

బండ్లగూడ: పారిశుద్ధ్య కార్మికులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రత్యేక దృష్టి సారించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. 17వ డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్ కాలనీ, 6వ డివిజన్‌లోని వ్యాలీ వివ్‌లో డోర్ టూ డోర్ చెత్త సేకరణ ప్రక్రియను పరిశీలించారు. అలాగే బండ్లగూడ నుంచి కిస్మత్‌పూర్ వరకు వెళ్లే ప్రధాన రహదారిపై స్వీపింగ్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇంట్లోని చెత్తను ప్రతి రోజూ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు సురేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించండి

రాజేంద్రనగర్: త్వరలో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ డాక్టర్ రవికుమార్ సబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా ఏసీపీ, టీపీఎస్, ఏఎంహెచ్‌ఓ, శానిటరీ జవాన్‌లతో సర్కిల్ కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ... శిథిలావస్థకు చేరుకున్న భవనాలను గుర్తించి వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా భవనాల్లో నివాసముంటున్న ప్రజలు అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

వ్యవసాయ విద్యార్థులు ఉద్యోగాలకే పరిమితం కావద్దు

వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ గోవర్ధన్



మాట్లాడుతున్న డాక్టర్ గోవర్ధన్

ఏజీవర్సిటీ: వ్యవసాయ విద్యార్థులు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా స్వయం ఉపాధి అవకాశాలను అన్వేషిస్తూ వ్యవసాయ రంగంలో కొత్త వ్యాపార ఆలోచనలు ప్రారంభించడం ద్వారా తమతోపాటు ఇతరులకూ ఉపాధి కల్పించవచ్చని వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ గోవర్ధన్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులకు వ్యవసాయంలో జీవ ఎరువుల తయారీ, వినియోగంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో జీవ ఎరువుల ప్రాముఖ్యత, రైతులకు కలిగే లాభాలు, జీవ ఎరువుల వ్యాపారం నైపుణ్యం, వ్యాపార ప్రారంభం తదిత అంశాలపై శిక్షణ ఇచ్చారు. దీంతో పాటు నేలను సారవంతం చేయటం, సారాన్ని సంరక్షించడంలో జీవ ఎరువుల సామూహిక ఉత్పత్తి, రైతులకు అందజేయడం తదితర అంశాల వల్ల సంభవించే లాభాలను వివరించారు. నేల సంరక్షణ, పశువులు, మానవ ఆరోగ్య సంరక్షణలో సూక్ష్మజీవుల పాత్రను గురించి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ త్రివేణి, డాక్టర్ సంతోషి, లావణ్య, డాక్టర్ శ్రీదేవి, కె.దీప్తి, విద్యార్థులు పాల్గొన్నారు.